క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: మండల పరిధిలోని నిడమర్రు–2 సచివాలయంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వైధాని వెంకట్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారు. ప్రతి ఇంటినీ సందర్శిస్తారని, కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

గాజుల అలంకరణలో అమ్మవారు



టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని టేకుపల్లి గ్రామంలో శ్రీ బాల పార్వతి సమేత రామేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా సోమవారం అమ్మవారికి గాజుల అలంకరణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారికి పలు రకాలు గాజులతో అందంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన ఆదిలక్ష్మి ప్రతిష్ఠోత్సవం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భోగాది వెంకటరెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో మండలి రామశాస్త్రులు స్థలంలో చేపట్టిన శ్రీఆదిలక్ష్మీదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవం సోమవారం ముగిసింది. ఉదయం గం .10.36లకు శ్రీఆదిలక్ష్మి నూతన శిల విగ్రహ ప్రతిష్ఠ, యంత్రస్థాపన జరిగింది. తదుపరి ప్రాణ ప్రతిష్ఠ, కళాన్యాసం, ధేనుదర్శనం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ జరిగింది. గ్రామ సర్పంచి మండలి ఉదయ భాస్కర్ దంపతులు, నిర్వాహక కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




మచిలీపట్నంటౌన్: నగరంలోని జవ్వారుపేట శ్రీ వెంకటేశ్వర హైస్కూల్లో ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఇంటాక్ ప్రతినిధులు ప్రతిభధ్రువీకరణ పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంటాక్ ప్రతినిధి సయ్యద్‌పీర్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యన్నారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ



గూడూరు: బైజూస్ పై అవగాహన పెంచుకుని విద్యార్థులకు తగురీతిలో శిక్షణ ఇవ్వాలని నోడల్ పర్సన్ శివాజీ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శిక్షణ సద్వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ తరగతులకు నోడల్ పర్సన్ ఎండి.దావూద్ పాల్గొన్నారు.

కార్నియాలు దానం



తుంగల కాశీలమ్మ (ఫైల్)

అవనిగడ్డ: అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి చెందిన తుంగల కాశీలమ్మ (75) మృతి చెందగా ఆమె కార్నియాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కాశీలమ్మ మృతి వార్త తెలుసుకున్న గ్రామ పెద్దలు తుంగల కోటేశ్వరరావు వారికి నేత్రదానం పట్ల అవగాహన కలిగించారు. కాశీలమ్మ కుమారులు రామకృష్ణ, నాగేంద్రం, కుమార్తె భారతి అంగీకారంతో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది వేకనూరు చేరుకుని కాశీలమ్మ నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తరలించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

బంటుమిల్లి సీడీపీవో సముద్రవేణి
పోషణ్ మహా మాసోత్సవం



కాకర్లమూడి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి

పెడన: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించేది అంగన్‌వాడీ కేంద్రాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని బంటుమిల్లి సీడీపీవో వి.సముద్రవేణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కాకర్లమూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా మాసోత్సవం కార్యక్రమంలో సీడీపీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లల విషయంలోనే కాకుండా రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతల విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకుని వారికి ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా పోషకాహారాన్ని అందించడం జరుగుతోందన్నారు. రక్తహీనతను నిలువరించడానికి గర్భిణులకు, బాలింతలకు కూడా బలవర్ధకమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. సర్పంచి పరసా లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రసూన్న, ఎంఎల్‌హెచ్‌బీ ఎస్.సత్యజ్యోతి, ఏఎన్‌ఎం అరుణ, ఆశా వర్కరు కె.పీటే, అంగన్‌వాడీ కార్యకర్తలు వైవీఎస్ లక్ష్మి, విజయలక్ష్మి, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లంపూడి గ్రామంలో రెండో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ రేవు శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొక్కిలిగడ్డ కనకదుర్గలు పాల్గొన్నారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఏఎన్‌ఎం సంతోషం, జీఎంఎస్‌కే షర్మిల మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి పౌష్టికాహార కిట్లు అందజేస్తుందని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ.నాగదుర్గ, కె.శ్రీదేవీ, బాలింతలు, గర్భిణులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగితే మరింత అభివృద్ధి

మండల సమావేశంలో ఎంపీపీ రాఘవరాణి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

నాగాయలంక: మండలం అభివృద్ధిలో సభ్యులు సమన్వయంతో ముందుకు సాగితే మరింత సత్ఫలితాలు అందిపుచ్చుకోవచ్చని ఎంపీపీ భోగాది రాఘవరాణి సూచించారు. ఎంపీపీ భోగాది రాఘవారాణి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్ ఉత్పత్తిలో ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఈఎల్ఆర్(ఎమర్జన్సీ లోడ్ రిలీఫ్)తప్పడం లేదని ప్రజలు, వినియోగదారులు సహకరించాలని మండల విద్యుత్ ఏఈ గొరిపర్తి ఏడుకొండలు వివరించారు. పలువురు సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ఉత్పత్తి, వినియోగంలో వ్యత్యాసమే ఈఎల్ఆర్‌కు కారణమని, పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఈమేరకు పరిశ్రమలకు విద్యుత్ వినియోగంపై పరిమితి విధిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఏఈ సభ్యులకు వివరించారు. నీటి పారుదలశాఖ ఏఈ పి.రవితేజ మాట్లాడుతూ మండలంలో 23 వేల ఎకరాల్లో వరిసాగు జరగాలని, వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలానికి మూడు వంతుల నీటి సరఫరా విధానం అమలు చేస్తున్నామన్నారు. మండలంలో వరిసాగు సక్రమంగా సాగాలంటే నీటిపారుదలశాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వంతుల విధానంతో రైతులు ఇబ్బందులు తప్పవని భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ జె.విమలకుమారి మాట్లాడుతూ మండలంలో ఓటర్ల సర్వే పూర్తి అయిందని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.కె.రామ్‌కుమార్, ఎంఈఓ–2 ఏ.రామారావు, ఏఓ ఏ.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు ప్రణాళికలు అవసరం



మాట్లాడుతున్న స్వామి వినిశ్చలానంద మహారాజ్

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ప్రథమ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా స్వామి వినిశ్చలానంద మహారాజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యసాధనకు ప్రణాళికలు సిద్ధంచేసుకొని నడుచుకోవాలన్నారు. యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా వ్యాపింప చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.కుమార్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోసపాటి బాబా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజా శ్రీనివాసరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రాజారమేష్, అటోనమస్ కంట్రోల్లర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఎస్‌వీపీ గుప్తా, వివిధశాఖాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నిరసన ప్రదర్శన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు

పెడన: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం అధిష్ఠానం పిలుపు మేరకు సోమవారం ఈ ప్రదర్శన జరిగింది. సీపీఎం పట్టణ కార్యదర్శి గోరు రాజు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దారు పీ మధుసూదనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచల రామనరసింహారావు వాసా గంగాధరరావు, సజ్జ మూర్తిరాజు, వూట్ల పేరేలింగం, గోరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ పాసుల పంపిణీ



బస్ పాసులు అందిస్తున్న డీఎం హనుమంతరావు, డైరెక్టర్ సురేష్

చల్లపల్లి: దాతల సాయం సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కే హనుమంతరావు కోరారు. సోమవారం చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఇచ్చిన రూ.60 వేల ఆర్థిక సాయంతో 1000 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాసులు అందజేశారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో ఆర్టీసీ డీఎం హనుమంతరావు, ఐవీఎం డైరెక్టర్ సురేష్ విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు అందజేశారు. అనంతరం పురిటిగడ్డ జెడ్పీ హైస్కూలు, రామానగరం నాగార్జున పబ్లిక్ స్కూల్, సెయింట్ మదర్ థెరిస్సా పాఠశాలల్లో ఉచిత బస్ పాస్‌లు విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పద్మనాభరావు, కేబీఎన్ శర్మ, కరస్పాండెంట్‌లు ఆండ్రూ గోమ్స్, ప్రశాంతి గోమ్స్, దోనేపూడి మురళీకృష్ణ, ఆర్టీసీ ఉద్యోగులు బోలెం రామారావు, కేవీ రావు, ఆంజనేయులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.





మచిలీపట్నం నగర పాలక సంస్థ రెండవ మహిళా మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిటికిన వెంకటేశ్వరమ్మ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు, ఎమ్మెల్యే పేర్ని నాని, తాజా మాజీ మేయర్, డెప్యూటీ మేయర్లు

– మచిలీపట్నం టౌన్

కంకిపాడు నుంచి ఆర్టీసీ అడ్వాన్స్ టికెట్ బుకింగ్

కంకిపాడు: కంకిపాడు బస్టాండు నుంచి అడ్వాన్స్ టికెట్ బుకింగ్, సరుకు రవాణా సేవలు అందుబాటులోకి వచ్చాయని ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజరు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. కంకిపాడు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ ఈ సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెలవుపై వెళ్లిన జేసీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ వ్యక్తిగత కారణాలపై సెలవు పెట్టారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు సెలవు తీసుకున్నారు. ఆమె తిరిగి ఈ నెల 11వ తేదీన విధులకు హాజరుకానున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జ్ బాధ్యతలను కలెక్టర్ పి.రాజాబాబు నిర్వహించనున్నారు.

చెరువు తవ్వకం పనుల నిలిపివేత



పెడన: పట్టణంలోని పైడమ్మ చెరువు సాగు హక్కులను వేలంలో దక్కించుకున్న వ్యక్తి ఆ చెరువు పక్కనే ఉన్న ప్రైవేటు స్థలంలో కూడా చెరువును తవ్వించి పైడమ్మ చెరువులో విలీనం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం సాయంత్రం విషయం తెలిసిన మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వరరావు హెచ్చరించడంతో పనులను నిలుపుదల చేశారు. ఆర్ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమిషనర్ మహేంద్ర ఆదేశాలతో పనులను నిలుపుదల చేయించామని, ఆయన పరిశీలించిన పిమ్మట తగు చర్యలు తీసుకుంటామన్నారు.

శివరామకృష్ణ క్షేత్ర నిర్మాణానికి విరాళం



కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివ రామకృష్ణ క్షేత్రానికి యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన దాసరి భాస్కరరావు–భారతి దంపతులు రూ.50 వేల నగదును విరాళంగా అందించారు. క్షేత్రం పూర్తిగా గ్రానైట్‌తో నిర్మిస్తుండగా, భాస్కరరావు దంపతులు నగదును తమ ఇంటి వద్ద కమిటీ సభ్యులకు అందించారు. కమిటీ సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం శివరామకృష్ణలు భాస్కరరావు దంపతులను సత్కరించారు.

7 నుంచి స్కూల్ గేమ్స్

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కన్వీనర్ సీహెచ్ సుబ్బారావు, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గేమ్స్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 600, 1500, 3000 మీటర్ల రన్నింగ్ పోటీలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావలిన్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. ఈ పోటీలన్నీ నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో జరుగుతాయి. వివరాల కోసం 99083 35876, 94401 77917 నంబర్లలో సంప్రదించవచ్చు. క్రీడాకారులు సీనియర్స్ విభాగంలో జనవరి 1, 2007, జూనియర్స్ జనవరి 1, 2010 తర్వాత పుట్టిన వారు అర్హులు.

7న కొబ్బరి చెట్ల ఫలసాయం హక్కులకు వేలం

మోపిదేవి: ఈనెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలోని కొబ్బరి చెట్ల ఫలసాయం పొందేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం.జయంతి సోమవారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి ఎంపీడీవో సమక్షంలో వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గత ఏడాది రూ.34,068 ఆదాయం రాగా ఈ ఏడాది 11 శాతం అదనంగా అనగా రూ.37,815 కంటే ఎక్కువ ఆదాయం వచ్చే వరకు వేలం నిర్వహిస్తామని వివరించారు.

రామలింగేశ్వరునికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వర శివలింగానికి భక్తులు అధిసంఖ్యలో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. శ్రావణ మాసం, శివునికి ప్రీతి పాత్రమైన సోమవారం సందర్భంగా అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పూజలు జరిపి శివలింగానికి పసుపు, కుంకుమ, విభూది, నారికేళ, గోక్షీరం తదితర పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అంతకుముందు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి నదీజలంతో శివయ్యకు స్వీయాభిషేకాలు జరిపారు. అర్చకుడు శర్మ శివయ్య, నందీశ్వరులను అలంకరించిన తీరు భక్తులను అలరించింది. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు విస్తృతం



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మౌనిక

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మౌలిక అన్నారు. సోమవారం కోడూరు–1 సచివాలయ పరిధిలోని మెరకగౌడపాలెం గ్రామంలో 104 సంచార వాహనం ద్వారా వైద్యసేవలతో పాటు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లీబిడ్డను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చేందుకు 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సేవలందిస్తున్నారని, ప్రసుత్తం ఈ సేవలను మరింతగా విస్తరించినట్లు వైద్యాధికారి తెలిపారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉమెన్ (హెచ్‌ఆర్‌పీడబ్ల్యూ), సివియర్ ఎనీమియా ప్రెగ్నెన్సీ ఉమెన్ (ఎస్ఏపీడబ్ల్యూ) సేవలను కొత్తగా అమల్లోకి తీసుకువచ్చారన్నారు. అధిక రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి ప్రభుత్వ వైద్యాధికారులు వారికి రక్తం ఎక్కించడానికి సూచించిన ఆసుపత్రులకు 102 వాహనంలో ఉచితంగా తీసుకువెళ్లి, మళ్లీ ఇంటికి కూడా తీసుకువస్తారని వైద్యాధికారి తెలిపారు. ఈ సేవలను అవసరమైన గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఆరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ మచిలీపట్నం డివిజన్ ఓఈ శ్రీనివాస పెరుమాళ్లు, సిబ్బంది ధనలక్ష్మి, గంగారత్నం, లక్ష్మీదుర్గ, నాగమణి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు జకార్డు యంత్రాల పంపిణీ



చేనేతలకు జకార్డు యంత్రాలు పంపిణీ చేస్తున్న టీఎంఏడీ, కార్మిక సంఘ ప్రతినిధులు

గూడూరు: కలనేత చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలోని చేనేత కార్మికులకు 5 జకార్డు యంత్రాలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన టీఎంఏడీ సంస్థ సౌజన్యంతో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు బూసం లోకనాథరావు గ్రామంలోని ఎంపిక చేసిన ఐదుగురు నిరుపేద చేనేత కార్మికులకు యంత్రాలను సమకూర్చారు. ఈ సందర్భంగా లోకనాథరావు మాట్లాడుతూ అత్యాధునిక డిజైన్లతో కూడిన పట్టు వస్త్రాలు నేయడానికి జకార్డు యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీఎంఏడీ సంస్థ సౌజన్యంతో ఇప్పటి వరకు గ్రామంలోని 30 మంది చేనేత కార్మికులకు జకార్డు యంత్రాలు సమకూర్చామన్నారు. జకార్డు యంత్రాలు పొందిన కార్మికులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న డిజైన్లలో చీరలు నేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. గ్రామంలోని నిరుపేద చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగటానికి దోహదపడుతున్న టీఎంఏడీ సంస్థ ప్రతినిధి వరలక్ష్మికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆడుదాం.. ఆంధ్రను పకడ్బందీగా నిర్వహించాలి



పెనమలూరులో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సునీతా శర్మ సూచించారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. 15 ఏళ్లు పై బడిన యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొనొచ్చని సూచించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన క్రీడాకారులు సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొ జట్లకు ప్రైజ్ మనీ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, పాఠశాలల పీడీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఉపసర్పంచ్‌గా సుధారాణి



ఉపసర్పంచ్‌గా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బొట్ట సుధారాణి

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ ఉపసర్పంచ్‌గా బొట్ట సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియ స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఎన్నికల అధికారి, ఈఓఆర్డీ పీ.వి.ఎస్. మైథిలి ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన ఉప ఎన్నికల్లో గ్రామంలోని నాలుగో వార్డు నుంచి బొట్ట సుధారాణి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఉప సర్పంచ్‌గా బొట్ట సుధారాణిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సుధారాణికి ఎన్నికల అధికారి మైథిలి ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో అంతా డిజిటల్ చదువులే

పామర్రు: రానున్న భవిష్యత్‌లో అంతా డిజిటల్ విధానం ద్వారా విద్యాబోధన ఉంటుందని దీనికి సన్నద్ధం కావాలని జిల్లా నోడల్ పర్సన్స్ పడవల శివాజీ, మహ్మద్ దావూద్ పేర్కొన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మండలంలోని పాఠశాల హెచ్‌ఎంలకు బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై సోమవారం శిక్షణ ఇచ్చారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ ట్యాబ్స్‌ను ఏవిధంగా వినియోగించాలనే అంశాలను తెలిపామన్నారు. రానున్న కాలంలో విద్య అంతా డిజిటల్ బోధనపైనే ఆధార పడుతుందని దీని కోసం ఇప్పటి నుంచి డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు.
బైజూస్ ట్యాబ్‌లను ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలియజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, నోడల్ టీచర్స్, డిజిటల్ అసిస్టెంట్స్, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌ఎంటీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.